# ఎన్టీఆర్ ట్రస్టు నిధులపై రగడ

## కాంగ్రెస్ ఆరోపణాస్త్రాలు □ దుర్వినియోగాన్ని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా □ చంద్రబాబు సవాల్



హైదరాబాద్ - న్యూస్‌టుడే

ఎన్టీఆర్ ట్రస్టుకు విదేశాల నుంచి వచ్చిన నిధులను మరో ఖాతాకు బదలాయించారని కాంగ్రెస్ చీఫ్‌విప్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. అమెరికా నుంచి కొందరు దాతలు ఎన్టీఆర్ ట్రస్టుకు పంపిన చెక్కులను ఇండియన్ హెరిటేజ్ ఫౌండేషన్ పేరుపై ఇవ్వాలని ఉమేష్ అనే వ్యక్తి ఉత్తరాలు రాసిన విషయం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. అవిశ్వాస తీర్మానంపై సోమవారం సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తెదేపా అధినేత అమెరికాలో పర్యటించినపుడు ఎన్టీఆర్ పేరు చెప్పి తీసుకున్న నిధులను ఇలా మరో ఖాతాకు బదలాయించడం హవాలా మార్గంలో మళ్లించడమే అవుతుందన్నారు. ట్రస్టుకు ఇప్పటి వరకు వచ్చిన డబ్బు ఏ ఖాతాలోకి వెళ్లిందో చెప్పాలని కోరారు. "ఎన్టీఆర్ బతికినప్పుడు మోసంచేశారు, చనిపోయిన తరవాత ఆయన పేరు చెప్పుకుని మోసం చేస్తున్నారు" అని అనగానే... తెదేపా సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనికి సంబంధించి స్పష్టంగా సమాచారం ఇస్తామని తెదేపా సభ్యుడు పయ్యావుల కేశవ్ చెప్పారు. ఎన్టీఆర్‌ను మోసం చేశామని పదేపదే చెప్పడం సరికాదన్నారు. నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టి మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కే చెల్లిందని విమర్శించారు. దీనికి పాలకపక్ష సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఇండియన్ హెరిటేజ్ ఫౌండేషన్ ఏర్పాటు, అందులో సభ్యులు ఎవరో చంద్రబాబు చెబితే బాగుంటుందని రోశయ్య అన్నారు.

### ట్రస్టు నిధులతో సేవా కార్యక్రమాలు

ఎన్టీఆర్ ట్రస్టుకు వచ్చే నిధులతో రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చంద్రబాబు చెప్పారు. పాఠశాల, రక్తనిధి కేంద్రం, 15 సంచార వైద్యశాలలు, ఫ్లోరైడ్ పీడిత గ్రామాల్లో రక్షిత మంచినీరు, నేత్ర శస్త్రచికిత్సలు, సంక్షేమ వసతిగృహాల్లో మూడు లక్షల మందికి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అమెరికాలో దాతలు ఇచ్చే విరాళాలకు పన్ను రాయితీ పొందడానికి వీలుగా ఇండియన్ హెరిటేజ్ ఫౌండేషన్‌ను అక్కడ నమోదు చేశామన్నారు. ఇందులో ఒక్క పైసా దుర్వినియోగం అవుతోందని నిరూపించినా తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి విరమించుకుంటానని సవాలు చేశారు. ఆదాయపన్ను శాఖ రూ.20 కోట్లు చెల్లించాలని నోటీసులు పంపించిన తరవాత ఫౌండేషన్‌ను ప్రారంభించారా? అని రోశయ్య వివరణ కోరారు. ఆదాయ శాఖ అడిగిన ప్రశ్నలకు వివరణ పంపించామనీ, తాము ఎప్పటి నుంచో సేవా కార్యక్రమాలను నడుపుతున్నామని బాబు తెలిపారు. దీనికి సంబంధించిన రికార్డులన్నీ స్పీకర్‌కు అందజేస్తామని అన్నారు. అయితే, తాము ముఖ్యమంత్రి భూములు, గనులు, వ్యాపారాలు, ప్రాజెక్టులు, మారిషస్ నుంచి వచ్చిన రూ.185 కోట్ల నిధులపై చేసిన ఆరోపణలకు సంబంధించిన రికార్డులు ఇవ్వాలని సవాలు చేశారు.

### చంద్రబాబు హౌసింగ్ దరఖాస్తుపై వాడివేడి చర్చ

జూబ్లీహిల్స్ హౌసింగ్‌కు రోశయ్య మనుషులను పంపించి డాక్యుమెంట్లు కావాలని అడిగారని చంద్రబాబు ఆరోపించారు. దీనికి రోశయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. "జూబ్లీహిల్స్‌లో చంద్రబాబు ప్లాట్ కోసం కక్కుర్తిపడ్డారని నేను అనుకోను. కానీ దానికి సంబంధించిన దరఖాస్తులపై మీ సంతకాలున్నాయి. వెంకటేశ్వర హౌస్ బిల్డింగ్ సొసైటీ కింద గోల్‌మాల్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి, గంట క్రితమే ఆ వివరాలు తెప్పించాను" అని రోశయ్య బదులిచ్చారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు స్థలం తీసుకున్నాననీ, ఆ తరవాత మూడో పార్టీ నుంచి జూబ్లీహిల్స్ సొసైటీలో స్థలం కొన్నానని చంద్రబాబు వివరణ ఇచ్చారు. దీనిపై విచారణ జరపాలని కోరారు.

సాక్షి పత్రికలో ల్యాంకో, ఇండియా సిమెంట్స్‌లాంటి పలు సంస్థలకు భాగస్వామ్యం ఉందని కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పరిటాల రవి హత్యకు సంబంధించి సీబీఐ కేసులో ఇరికించడానికి వై.ఎస్.జగన్‌పై అనేక సార్లు తెదేపా ఆధార రహిత ప్రకటనలు చేసిందనీ, దానికి అనుగుణంగా పత్రికల్లో కథనాలు ప్రచురించారని ఆరోపించారు. అందుకే నిష్పక్షపాతంగా పత్రికలు ఉండాలనే ఉద్దేశంతో కొంత మంది శ్రేయోభిలాషులతో కలిసి పత్రిక తీసుకువచ్చారని వివరించారు. ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ కంట్రిబ్యూటర్ స్థాయి నుంచి పైకి ఎదిగారని చెప్పారు. కానీ జగన్ పేపరు పెడితే విమర్శించడం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి సంస్థ చేసిన డిపాజిట్ల సేకరణపై మాట్లాడితే పత్రికా స్వేచ్ఛపై దాడి అని ప్రతిపక్షపార్టీ నేతలు విరుచుకుపడడం అర్థరహితమని అన్నారు. 30 సం॥ ముందు రామోజీరావు ఆస్తులు ఏమిటి? పేపరు ఎలా వచ్చింది అని కిరణ్‌కుమార్‌రెడ్డి అనగానే, తేదేపా సభ్యుడు నాగం జనార్దన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. సభలో వివరణ ఇచ్చుకోలేని వ్యక్తుల గురించి తమను మాట్లాడవద్దన్న పాలకపక్షం, మళ్లీ అలాంటి ఆరోపణలు చేయడం తగదని మండిపడ్డారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రసంగం అనంతరం చంద్రబాబు వివరణ ఇవ్వడానికి ప్రయత్నించగా.. ముఖ్యమంత్రి అభ్యంతరం వ్యక్తంచేశారు. అవిశ్వాస తీర్మానంపై కాంగ్రెస్ పక్షాన కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారని చెప్పారు. ప్రభుత్వం సమాధానం చెప్పిన తరవాత ప్రతిపక్ష నేత మాట్లాడాలన్నారు. దీనిపై చంద్రబాబు ఏ విధంగా మాట్లాడాలో స్పీకర్ రూలింగ్ ఇవ్వాలని కోరారు. దీనికి చంద్రబాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. "మీరు మాట్లాడమంటే.. మాట్లాడాలి. ఇండియన్ హెరిటేజ్ ఫౌండేషన్ విషయంలో రోశయ్య నన్ను వివరణ ఇవ్వాలన్నారు. సమాధానం చెప్పాను. ఇప్పుడు నాపై చేసిన ఆరోపణలకు వివరణ ఇవ్వబోతుంటే, అభ్యంతరం చెబుతున్నారు. సభ మీ కనుసన్నలలో నడిపిస్తున్నారు. నాలుగు సం॥గా స్పీకర్‌ను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు" అని బాబు తీవ్రంగా మండిపడ్డారు.